పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రేమాలవారిపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు
- 610 మందికి ఉచితంగా మందుల పంపిణీ



రేమాలవారిపాలెంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఎంపీపీ భోగాది తదితరులు

మర్రిపాలెం(నాగాయలంక): పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని రేమాలవారి పాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని రేమాలవారిపాలెం, టి.కొత్తపాలెం గ్రామాల్లో 610 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలతో పేదలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు ఇంటింటికీ చేరువ అయ్యాయని, ఇది చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. రాష్ట్రంలో నెలకొల్పుతున్న వైద్య కళాశాలలతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సమృద్ధిగా సాగునీరు అందిస్తుంటే 75 వేల ఎకరాల్లో పంట ఎండి పోయినట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అవనిగడ్డ సభలో మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న సింహాద్రి సీనియర్ సిటిజన్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి, సర్పంచ్ చోడిశెట్టి బుజ్జమ్మ, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ రేమాల బెనర్జీ, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్లు ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, తహసీల్దార్ జె.విమల కుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● అడపావారిపాలెం(మోపిదేవి) : ఆరోగ్యశ్రీలో వైద్యం చేయిస్తే చిన్నారి కీర్తనకు పూర్తిగా మాటలు వస్తాయని డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. అడపావారిపాలెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు డాక్టర్ టి. వేదశాంతి, డాక్టర్ శివప్రసాద్, ఎస్. శేఖర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కారుమూరి రామయ్య కుమార్తె నాలుగేళ్ల కీర్తన ఏడాది కిందట ఆడుకుంటూ రాళ్లపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైందన్నారు. తలకు గాయం వల్ల మాటలు నత్తిగా వస్తున్నాయని గుర్తించామని చెప్పారు. ఈమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించడం వల్ల పూర్తి స్థాయిలో మాటలు వస్తాయని చెప్పారు. మొత్తం 222 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, పండలనేని శివప్రసాద్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం..

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు, యువ నాయకుడు జోగి రాజీవ్ అన్నారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నడుపూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 225 మందికిపైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇద్దరికి గుండె సమస్యలు ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 19 మందికి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందని, తుది పరీక్షలు చేయించుకోవాలని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలోని కంటి విభాగానికి సిఫార్సు చేశారు. మిగిలిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పిల్లల డాక్టర్ సుదేష్‌బాబు, ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ ఆఖిలాండేశ్వరి, గైనకాలజిస్ట్ డాక్టర్ టి. అనూష, పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వేజ్‌హైదర్‌లు రోగులను పరీక్షించారు. కంటి వైద్యురాలు ఉమర్‌ముక్తా, జిల్లా మలేరియా అధికారి వెంకట్రావు కూడా పరీక్షలు నిర్వహించి శిబిరాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీఓ బీఎస్‌ఎన్ రెడ్డి, తహసీల్దార్ పి. మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంఈఓ-2 హరనాథ్ శిబిరాన్ని పరిశీలించారు. ఎంపీపీ వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, అచ్యుతరావు, సర్పంచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని 50వ డివిజన్ సుందరయ్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరాన్ని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రారంభించారు. 12 డివిజన్లకు చెందిన ప్రజలు హాజరుకాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, 50, 46, 49 డివిజన్ల కార్పొరేటర్లు మరీదు రాటాలమ్మ, భోగాది సాయిబాబు, పల్లి శేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల పరిధి కొమాళ్లపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. శిబిరాన్ని ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్న కుమారి ప్రారంభించగా కృత్తివెన్ను, చినపాండ్రాక, లక్ష్మీపురం పీహెచ్‌సీల వైద్యులు సందీప్, మిధున, లావణ్య, హీరా, అల్తాఫ్, సర్పంచ్ ప్రత్తిపాటి అనూష, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



నడుపూరులో మందులు అందజేస్తున్న రాజీవ్ తదితరులు



బందరు శిబిరంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

ఆరోగ్య సురక్ష వరం..

గూడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు వరం అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మంగళవారం గూడూరు-2 సచివాలయం పరిధిలోని ప్రజల కోసం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి జోగి రాజీవ్ ప్రారంభించి మాట్లాడారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, సర్పంచి లింగం సులోచనారాణి, తహసీల్దార్ బి. విజయప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

● చల్లపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గ్రామ సచివాలయం-2 పరిధిలోని వారి కోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, డీఎల్‌డీఓ జి.పద్మ, డీఎస్ఓ పార్వతి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డెప్యూటీ సీఈఓ గంజి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలకవర్గ సభ్యురాలు షేక్ దిల్‌షాద్ నజరానా, ఎంఈఓ-2 పి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం తదితరులు పర్యవేక్షించారు.

345 మందికి వైద్య పరీక్షలు..

బంటుమిల్లి: మల్లపరాజుగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 345 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ వెలివెల చినబాబు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కుమారుడు జోగి రాజీవ్‌తో కలిసి ప్రారంభించి రోగులతో మాట్లాడారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం, విజయవాడ ప్రభుత్వాస్పత్రులకు సిఫార్సు చేశారు. శిబిర పర్యవేక్షణాధికారి, పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. సువర్చల, సర్పంచ్ దూసనపూడి అవతారం, బంటుమిల్లి, పెదతుమ్మిడి పీహెచ్‌సీల వైద్యులు కె. పవన్‌కుమార్, సీహెచ్. సౌందర్య, వి. జయశ్రీ, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్నే కోరుకుంటున్న ప్రజలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వృద్ధురాలికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కె.కొత్తపాలెం(మోపిదేవి): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కె కొత్తపాలెం గ్రామ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుమారుడు వికాస్‌బాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన హామీలన్నీ 99 శాతం పూర్తి చేశామని, ఇంకా గ్రామాల్లో మిగిలిన సమస్యలను గుర్తించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. రాజమండ్రి జైలులో చంద్రబాబును పరామర్శించిన తరువాత పవన్ కల్యాణ్ చేసిన పొత్తుల ప్రకటనను అపవిత్ర కలయికగా భావించిన ప్రజలు పవన్ కల్యాణ్ సభలకు రావడం లేదన్నారు. జగనన్నే మరోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, ఎంపీటీసీ మత్తి లత, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 16 రోజులుగా జరిగిన 66వ వార్షిక వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం రాత్రి నాగాయలంకలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకుడు అంబా సాయి కిరణ్ శర్మ పూజలు చేశారు. ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. చిట్టా సాంబశివరావు, మానేపల్లి శ్రీనివాసరావు, తలశిల నరసింహారావు (తాతయ్య), గోలి కోటేశ్వరరావు, విస్సంశెట్టి రాము, గడ్డిపాటి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నాగాయలంక: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రేమాలవారిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పెడన: మండల పరిధి చేవేంద్ర గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మంత్రి జోగి రమేష్ గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

6న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పెడన: స్థానిక పైడమ్మ ఆలయం సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఈ నెల ఆరో తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులు, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ హాజరుకానున్న నేపథ్యంలో ప్రత్యేక చొరవ తీసుకుని తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు మచిలీపట్నంలో 'జగనన్నకు చెబుదాం'

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు నియోజకవర్గానికి సంబంధించి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. తనతో పాటు జిల్లా అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమం గురించి ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

జావెలిన్‌త్రో స్టిక్స్ పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు జావెలిన్‌త్రో స్టిక్స్ అందజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు నాదెండ్ల బసవేశ్వరరావు, ఎన్. సుధాకరరావు కలిసి 10 జావెలిన్‌త్రో స్టిక్స్‌ను ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావుకు అందజేశారు. దాతలను హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు గరికపాటి మారుతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు అభినందించారు.

లఖీంపూర్ ఖేరి దోషులను శిక్షించాలి

అవనిగడ్డ: ఉత్తరప్రదేశ్‌లో ఆందోళన చేస్తున్న రైతుల మరణానికి కారణమైన మంత్రి కుమారుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక వంతెన సెంటర్‌లో మంగళవారం మానవహారం నిర్వహించారు. నిరసన తెలుపుతున్న రైతులపై అమానుషంగా కారు నడిపి రైతులు, జర్నలిస్టు మరణాలకు కారణమైన ఘటన ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, మండల కార్యదర్శి ఎస్. అర్జునరావు, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నపరెడ్డి నాగమణి, సుశీల, ఎం. వాణి, కాశీహంస తదితరులు పాల్గొన్నారు.

● వక్కలగడ్డ(చల్లపల్లి): లఖీంపూర్ ఖేరి ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు సంఘాల సమన్వయ సమితి, ట్రేడ్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు పీఏసీఎస్ ఎదుట బ్లాక్ డే పాటిస్తూ రైతులు నిరాహార దీక్ష చేశారు. కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడి దాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మేకా నరసింహారావు, అడ్డాడ ప్రసాద్ బాబు, గుత్తికొండ రాము, రైతులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

మచిలీపట్నంటౌన్: విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ డెప్యూటీ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. స్థానిక కామాక్షి అమ్మవారి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా లబ్ధి పొందేందుకు చేతి వృత్తిదారులు ఎలా దరఖాస్తులు చేసుకోవాలనేది వివరించారు. 60 మంది చేతి వృత్తి కళాకారులు సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రకాశరావు, నాయకులు వీరబ్రహ్మం, సర్వేపల్లి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మానవహారం



బందరు రేవతి సెంటర్‌లో మానవహారం

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రేవతి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆవిర్భావ దినోత్సవం, కార్మిక పోరాటాలకు సంఘీభావంగా కార్మిక, కర్షక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మనువాద, మతోన్మాద బీజేపీ ప్రభుత్వం నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానం నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక, కర్షకుల ఐక్య పోరాటాల ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్, బీఎస్‌ఎన్‌ఎల్ యూనియన్ నాయకుడు ఏడుకొండలు, ఎల్ఐసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్. ధనుంజయ, పి. నాగయ్య, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు పి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చల్లపల్లి: గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఒడుగు శంకరరావు కుమారుడు పృథ్వీకి మచిలీపట్నం బెరాకా మినిస్ట్రీస్ అధినేత బి.కిరణ్ పాల్ రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పృథ్వీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో పాటు, అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. శంకరరావు అప్పులు చేసి ఇప్పటి వరకు దాదాపు రూ.20 లక్షలు ఖర్చు పెట్టి చికిత్స చేయించారు. ఇంకా రెండు కాళ్లకు ఆపరేషన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇంటి వద్ద మంచానికి పరిమితమై ఉన్న పృథ్వీ పరిస్థితిని ఏపీ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టు శ్యాంప్రసాద్ ద్వారా తెలుసుకున్న బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ మంగళవారం స్థానిక సన్‌ఫ్లవర్ కాలనీలో పృథ్వీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. తనవంతుగా రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు ఈ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లా ఫణిబాబు, జి. నాగజ్యోతి, దాసి సీతారామరాజు, ప్రదీప్, డేవిడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు గూడూరు హైస్కూల్‌కు చెందిన 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. పమిడిముక్కలలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో జి.యువశ్రీ, ఎం.గౌరీ సాయిలక్ష్మి, బాలుర విభాగంలో సీహెచ్.వనసాయి, వి.హర్షవర్ధన్, ఎస్.భగత్‌కుమార్ ఎంపికయ్యారని చెప్పారు. అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో పి.లిల్లీ గ్రేస్, జె.వనజశ్రీ, కె.ఛరిష్మా, ఆర్.లాలిత్య, ఎల్.రమ్య, బాలుర విభాగంలో వి.హేమ చంద్ర, వై.నాగచైతన్య, ఎల్.చరణ్ ఎంపికయ్యారు. వీరు అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్, కేఎస్ఎన్ మూర్తిని పలువురు అభినందించారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాల లబ్ధి



మాట్లాడుతున్న పద్మావతి

గూడూరు: ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందగలుగుతారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్. పద్మావతి అన్నారు. మంగళవారం ఆకులమన్నాడులోని రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ ఇప్పటికే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు. స్థానికంగా నివాసం ఉండని రైతులు ఓటీపీల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిరమణి మాట్లాడుతూ రైతులు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించవద్దన్నారు. పంటలకు చీడపీడలు సోకినప్పుడు స్థానిక వ్యవసాయ శాఖాధికారుల సూచనలు తీసుకోవాలని కోరారు. గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, మండల వ్యవసాయ శాఖాధికారి జి.శివప్రసాద్, వీఏఏలు కల్యాణ్, పవన్, రైతులు పాల్గొన్నారు.

వాసవిలో స్వచ్ఛతా హీ రన్

పెడన: మండల పరిధి నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్వచ్ఛతా హీ రన్, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ కుమార్ బాబు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మచిలీపట్నంలోని పాండురంగస్వామి దేవాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించండి

మచిలీపట్నంటౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఇకపై తమ కళాశాలలోనే కాకుండా రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కళాశాల నుంచైనా పరీక్ష రుసుం చెల్లించే అవకాశాన్ని ఇంటర్మీడియెట్ బోర్డు కల్పించిందని స్థానిక లేడీయాంప్టిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనందకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీలోగా పరీక్ష ఫీజును చెల్లించవచ్చునన్నారు. 2024 మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షకు హాజరయ్యేందుకు అర్హత లభిస్తుందన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

9 మంది జూదరుల అరెస్ట్

బంటుమిల్లి: మండల పరిధి కంచడం, రామవరపుమోడి గ్రామాల్లో మంగళవారం పోలీసులు దాడులు చేసి 9 మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఎ. పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కంచడం, రామవరపుమోడి గ్రామాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. కంచడం గ్రామంలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1,120 స్వాధీనం చేసుకున్నారు. అలాగే రామవరపుమోడి గ్రామంలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 410 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దోమల మందు పిచికారీ

నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్ప పంచాయతీ పరిధిలో దోమల నిర్మూలన మందును మంగళవారం పిచికారీ చేశారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో స్థలాల రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం

ఎంపీపీ సంగా మధుసూదనరావు



రిజిస్ట్రార్‌తో చర్చిస్తున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: గూడూరులో గత ఏడేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రిజిస్ట్రేషన్లను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మచిలీట్నం సబ్ రిజిస్ట్రార్ హామీ ఇచ్చారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు తెలిపారు. గూడూరులో ఇళ్లు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు అవసరమైన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలువడి నెల రోజులైనా మచిలీపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిర్వహించడం లేదు. దీనిపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతుండటంతో మంగళవారం ఎంపీపీ సంగా మధుసూధనరావు, గూడూరు తహసీల్దార్ జీవీ ప్రసాద్‌లు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్లు జరగకపోవడంపై అధికారులను ఆరా తీశారు. దీనిపై స్పందించిన రిజిస్ట్రార్... రిజిస్ట్రేషన్లు జరగకపోవడానికి తమ వైపు నుంచి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ప్రస్తుతం దస్తావేజు లేఖరులు సమ్మెలో ఉన్నందున త్వరలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొరిపర్తి రవికుమార్, వీఆర్వో కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

బందరులో 96.67 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ మూడో రోజైన మంగళవారానికి 96.67 శాతం పంపిణీ చేశారు. నగరంలో 19,123 పింఛన్లు ఉండగా మంగళవారానికి 18,487 మందికి పింఛన్లను అందజేశారు. రూ. 5,38,33,250లకు గానూ రూ. 5.20 కోట్లు పంపిణీ చేశారు. ఇంకా 636 పింఛన్లు అందజేస్తే నూరు శాతం పంపిణీ పూర్తవుతుంది.

టేకుపల్లి వద్ద కారు బోల్తా

టేకుపల్లి(మోపిదేవి): వెంకటాపురం నుంచి టేకుపల్లి వెళ్లే రహదారిలో మంగళవారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఎదురుగా వస్తున్న గేదెను తప్పించే క్రమంలో కారు బోల్తా పడి ఆగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. కారు వివరాలు, అందులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ పద్మ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



విజయవాడ వెళ్లి మహిళకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అష్లలున్నీసా

మచిలీపట్నంటౌన్: నగరంలోని 18వ డివిజన్ బుట్టాయిపేటకు చెందిన అమృత శంకరుడు అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. డివిజన్‌కు చెందిన వలంటీర్ అష్లలున్నీసా మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను సొమ్మును అందజేసింది. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

● చల్లపల్లి: చల్లపల్లి గ్రామ సచివాలయం-3 పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు పైడిపాముల కుమారి అనారోగ్యంతో కొద్ది రోజులుగా తాడిగడప కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఐదు రోజులుగా కోమాలో ఉన్న కుమారి మంగళవారం కోమా నుంచి బయటకు రావడంతో వలంటీర్ లిల్లీపద్మ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. వలంటీర్‌ను పలువురు అభినందించారు.